క్లుప్తంగా

మరింత అభివృద్ధి చేస్తా.. ఆశీర్వదించండి..



నగరంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎంపీ భరత్

రాజమహేంద్రవరం సిటీ: గతం టీడీపీ పాలకులు పట్టించుకోని నగరాన్ని అద్భుతంగా తీర్చిదిద్దానని ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ అన్నారు. బుధవారం నగరంలోని 29వ డివిజన్ శ్యామలాంబ గుడి వీధి వద్ద నుంచి క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నగరవాసులను ప్రభుత్వ సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అర్హులందరికీ పథకాలను అందించామన్నారు. ప్రజల మద్దతుతో వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలుపొందగానే ఇళ్ల పట్టాలిచ్చిన వారందరికీ ఇళ్లు కట్టించే బాధ్యతను నేనే తీసుకుంటానన్నారు. రోడ్లు, డ్రైనేజీలు, వీధి లైట్లు, పార్కులు అన్నీ అభివృద్ధి చేశామన్నారు. నగరానికి ప్రత్యేక గుర్తింపు తీసుకు రావాలన్నదే నా సంకల్పం అన్నారు. తన ప్రయత్నానికి నగరవాసులు మద్దతు ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపించాలని ఎంపీ భరత్ రామ్ కోరారు.

ఖాళీ స్థలం పన్ను చెల్లింపు



కమిషనర్ దినేష్‌కుమార్‌కు చెక్కును అందజేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో షాడే గర్ల్స్ హైస్కూల్‌కు సంబంధించిన ఖాళీ స్థలానికి సంబంధించి బకాయి ఉన్న కోటి రెండు లక్షల ఇరవై రెండు వేల రూపాయలను బొల్లినేని కిమ్స్ హాస్పిటల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రామ్మోహన్‌రావు బుధవారం మున్సిపల్ కమిషనర్ దినేష్ కుమార్‌కు చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా చెక్కును అందజేసిన బొల్లినేని కిమ్స్ హాస్పటల్ యాజమాన్యాన్ని కమిషనర్ అభినందించారు.

ఆలయంలో ప్రత్యేక హోమాలు

కడియం: కడియపులంక గ్రామ దేవత ముసలమ్మ అమ్మవారి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. సింహాచల దేవస్థానం నుంచి విచ్చేసిన ప్రముఖ వేదపండితుల సమక్షంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు ఏర్పాట్లు పర్యవేక్షించింది.

న్యాయ సేవలపై సదస్సు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలోతో న్యాయమూర్తి కె.ప్రత్యూషకుమారి బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ప్రీ, అరెస్టు, అరెస్టు, రిమాండ్ దశల్లో అందుబాటులో ఉన్న న్యాయ సేవలు, పోక్సో చట్టం 2012, ఆంధ్ర ప్రదేశ్ విక్టిమ్ కాంపెన్సేషన్ స్కీమ్ 2015, లైంగిక వేధింపులు, ఇతర నేరాల బాధితులకు నల్సా పరిహార పథకం 2018 అంశాలపై అవగాహన కల్పించారు. లీగల్ ఎయిడ్ క్లినిక్‌ల పనితీరుపై పారా లీగల్ వలంటీర్లు, ప్యానల్ న్యాయవాదులతో చర్చించారు. సదస్సులో మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అధికారి కె.విజయకుమారి, పోలీసు అధికారులు, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, వార్డు సెక్రటరీలు, తదితరులు పాల్గొన్నారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రభుత్వ వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థులకు పోటీలు నిర్వహించి ధ్రువీకరణ పత్రాలు అందజేసినట్టు మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సౌభాగ్యలక్ష్మి బుధవారం తెలిపారు. వ్యాధి వ్యాప్తి, నివారణ, చికిత్స, వ్యాధిపై సమాజ దృక్పథం, వైద్య విద్యార్థుల పాత్ర అంశాలపై క్విజ్ పోటీలను నిర్వహించామన్నారు. ఈ పోటీలలో ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశామన్నారు. ప్రతి ఒక్కరూ వైద్య విద్య నేర్చుకోవటంతో పాటు సమాజం పై పూర్తి అవగాహన కలిగిఉండాలన్నారు. కార్యక్రమములో హెచ్‌వోడీ వీవీ దుర్గాప్రసాద్, అసోసియేట్ ప్రొఫెసర్లు కేవీ ఫణిమాధవి, డాక్టర్ వి.సూర్యారావు, డాక్టర్ ఆర్.సురేంద్రబాబు, ఎస్.శ్రీనివాస మూర్తి, కె.ప్రసన్నకుమార్, టీపీ.శాస్త్రి, ఆర్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల సమస్యకు మోక్షం

- శరవేగంగా నిర్మాణ పనులు
- ఇప్పటికే పూర్తయిన పలు రహదారులు



కడియం-బుర్రిలంక రోడ్డులో జరుగుతున్న పనులు

కడియం: ఎన్నో ఏళ్లగా అస్తవ్యస్తంగా ఉన్న రహదారులకు మోక్షం లభించింది. మండలంలోని అతిపెద్ద గ్రామ పంచాయతీల్లో కడియపులంక ఒకటి. ఈ పంచాయతీ పరిధిలో బుర్రిలంక, వెంకాయమ్మపేట గ్రామాలు ఉన్నాయి. కడియం పేరుచెబితే గుర్తుకొచ్చే నర్సరీలు. ఈ గ్రామంలో మొక్కల వ్యాపారం ఎక్కువగా జరుగుతుంది. అయితే గత కొన్నేళ్లుగా ప్రధాన రోడ్లు సక్రమంగా లేకపోవడం వ్యాపానికి సమస్యగా మారింది. అయితే ఎట్టకేలకు సమస్యకు మోక్షం లభించింది.

ప్రధాన రోడ్ల నిర్మాణం

ఆర్అండ్‌బీ, పంచాయతీ, నాబార్డు పరధిలోని సుమారు 55 కిలోమీటర్ల వరకు రోడ్లు ఈ గ్రామం విస్తీర్ణంలో ఉన్నాయని అంచనా. వీటిలో అత్యంత ప్రధానమైనవి మండల కేంద్రమైన కడియం నుంచి కడియపులంక, కడియం నుంచి బుర్రిలంక, కడియం నుంచి వెంకాయమ్మపేట గ్రామాలకు వెళ్లే రోడ్లు. ఈ ప్రధాన రోడ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. ఇటీవల రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ శంకుస్థాపన చేసిన కడియం-కడియపులంక జాతీయ రహదారి వయా బుర్రిలంక రోడ్డు నిర్మాణం దాదాపు పూర్తికావొచ్చింది. రూ.2.60కోట్ల అంచనా వ్యయంతో జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు. రెండున్న కిలోమీటర్ల పరిధిలో పక్కా సీసీ రోడ్డును నిర్మిస్తున్నారు.

అందుబాటులోకి రహదారులు

మండల కేంద్రమైన కడియం నుంచి వెంకాయమ్మపేట మీదుగా బుర్రిలంక గ్రామానికి వెళ్లే రోడ్డు నిర్మాణ పనులు కూడా శరవేగంగా సాగుతున్నాయి. ఇది కూడా రెండున్నర కిలోమీటర్ల పరిధిలో సీసీ, తారు రోడ్డుగా నిర్మిస్తున్నారు. తారు రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి. సీసీ రోడ్డు కూడా త్వరలోనే ప్రజలకు అందుబాటులో రానుంది. ఆర్అండ్‌బీ నిధులు రూ.2.80 కోట్ల అంచనాలతో ఈ పనులు ప్రారంభించారు. అంతే కాకుండా ప్రధాన రోడ్లకు అనుసంధానంగా ఉన్న ఇంటర్‌లింక్ రోడ్లు కూడా పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. గత ఏడాదిన్నర కాలంగా బుర్రిలంక ప్రాథమిక పాఠశాల నుంచి జాతీయ రహదారికి వెళ్లే రోడ్డు, దళిత వాడలో రోడ్డు, కొబ్బరితోట కాలనీలో రోడ్డు తదితర రోడ్లకు ఒక కోటి యాభైలక్షల రూపాయల నిధులను వెచ్చించారు. మొక్కల లోడు వాహనాలు, నర్సరీ పనులకు వచ్చే కూలీలతో నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్ల నిర్మాణం పూర్తి కావడంపై సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వేగంగా పనులు

పనులు ప్రారంభించిన వెంటనే రోడ్ల నిర్మాణం చేపట్టి పూర్తి చేస్తున్నారు. గతంలో నెలల తరబడి ఇబ్బందులు పడేవాళ్లం. ఇప్పుడు ఆ ఇబ్బంది లేకుండా వేగంగా పనులు కొనసాగుతున్నాయి. వెంటనే ప్రజలకు అందుబాటులోకి వస్తున్నాయి.

– వి.రాంబాబు, నర్సరీ కూలీ

సౌకర్యవంతంగా..

నిత్యం వివిధ రకాల వాహనాలు, నర్సరీ పనివారితో రద్దీగా ఉండే రహదారులను పక్కా రోడ్లు నిర్మిస్తున్నారు. దీంతో ప్రజలకు సౌకర్యం పెరుగుతోంది. వేగంగా పనులు జరగడం సతోషంగా ఉంది. ప్రభుత్వం చేసిన మేలు మర్చిపోలేం

– కె.వీర్రాజు, నర్సరీ రైతు

విధి నిర్వహణలో నిబద్ధతతో వ్యవహరించాలి

రాజమహేంద్రవరం సిటీ: విధి నిర్వహణలో ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలని అప్పుడే అదనపు ఆదాయం సాధ్యమతుందని ఆర్టీసీ డిపో మేనేజర్ షేక్ షబ్నం విజ్ఞప్తి చేశారు. బుధవారం నగరంలో ఆర్టీసీ డిపోలో వృత్తి నిబద్ధతతో పనిచేసి అత్యధిక కేఎంపీఎల్ తెచ్చిన ముగ్గురు డ్రైవర్లకు, అత్యధిక ఈపీకే తెచ్చిన నలుగురు కండక్టర్లు, ఇద్దరు డ్రైవర్లు, ప్రతిభ కనబరిచిన గ్యారేజీ సిబ్బంది ఇద్దరికీ డీఎం చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులతో సత్కరించారు. కార్యక్రమంలో డిపో అసిస్టెంట్ మేనేజర్ అజయ్ బాబు, అసిస్టెంట్ ఇంజినీర్ ఈశ్వరరావు, ట్రాఫిక్ సిబ్బంది, గ్యారేజీ సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది, ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కంబాలచెరువు: స్థానిక పుష్కర్‌ఘాట్ సమీపంలోని రైల్వే బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని (54) మూడో పట్టణ పోలీసులు బుధవారం గుర్తించారు. లుంగీ, ఫుల్ హ్యాండ్స్ షర్ట్ ధరించిన వ్యక్తి రైల్వే బ్రిడ్జి కింద మృతి చెంది ఉన్నాడని స్థానికుల నుంచి సమాచారం అందుకున్న పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని మృతదేహం వద్ద ఆచూకీ కోసం గాలించారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించారు.

ఉపవాసం ఉంటూ.. ఆదర్శంగా నిలుస్తూ..

అజాద్ చౌక్ మసీద్ వద్ద ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ భరత్



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎంపీ మార్గాని భరత్‌రామ్

రాజమండ్రి సిటీ: పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు అల్లాపై భక్తి, అపారమైన గౌరవానికి సూచికగా కఠోర ఉపవాసాలను పాటిస్తూ సమాజ సేవలో ముందుండడం హర్షణీయమని రాజమహేంద్రవరం ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ అభ్యర్థి మార్గాని భరత్ రామ్ అన్నారు. బుధవారం రాత్రి నగరంలోని జాంపేట అజాద్ చౌక్ సెంటర్ వద్ద ఉన్న అహలే-హదీస్ మసిజిద్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ఎంపీ భరత్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముస్లింలకు రంజాన్ పవిత్ర మాస శుభాకాంక్షలు తెలిపారు. నెల రోజుల పాటు అత్యంత కఠోర ఉపవాస దీక్షలతో అల్లాను స్మరిస్తూ, అల్లా చూపిన సన్మార్గంలో ముస్లింలు పయనించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో విశిష్ట అతిథులుగా వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నగర అబ్జర్వర్ రావిపాటి రామచంద్రరావు, నగర వైసీపీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, చందన నాగేశ్వరరావు, మహ్మద్ అలీ బాయ్ పాల్గొన్నారు.

భరత్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తాం

పద్మశాలీ సేవా సంఘం నేతలు



సమావేశంలో మాట్లాడుతున్న పద్మశాలీ సేవా సంఘం సభ్యులు

సీటీఆర్ఐ: పద్మశాలీ సామాజికవర్గానికి కల్యాణ మండపం నిమిత్తం పేపర్‌మిల్లు ఎదురుగా ఆర్అండ్‌బీ వర్క్ షాపు సమీపంలో రూ.3 కోట్ల విలువ చేసే 728 గజాల స్థలాన్ని, ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.20లక్షలు అందించిన ఎంపీ భరత్ రామ్‌ను వచ్చే ఎన్నికల్లో రాజమండ్రి సిటీ ఎమ్మెల్యేగా గెలిపించి రుణం తీర్చుకుంటామని పద్మశాలీ సేవా సంఘం నాయకులు జామిశెట్టి గాంధీ, సప్పా ఆదినారాయణ పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత 6 దశాబ్దాలుగా తమ సామాజికవర్గం తరపున కార్తిక వనసమారాధనలు నిర్వహిస్తూ, ఆ కార్యక్రమానికి అన్ని పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులను ఆహ్వానిస్తున్నామన్నారు. తమ సంఘానికి సమావేశం నిర్వహించుకోవడానికి కనీసం కార్యాలయం లేదని ఎంతమంది ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినప్పటికీ స్పందించలేదన్నారు. గతేడాది కార్తిక వన సమారాధనకు ఎంపీ భరత్ రామ్, రాజమహేంద్రవరం పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి డాక్టర్ గూడూరి శ్రీనివాస్, రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావులను ఆహ్వానించి తమ కోర్కెను వారి ముందు ఉంచామన్నారు. పద్మశాలీ కల్యాణ మండపానికి స్థలం కేటాయిస్తామని హామీ ఇచ్చిన కొద్ది రోజుల్లోనే స్థలం కేటాయించడంతో పాటు తన ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.20లక్షలు కేటాయించి, తమ సంఘం అధ్యక్షుడితో కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన చేయించారన్నారు. అలాగే కార్పొరేషన్ తరపున మరో రూ.5 లక్షల నిధులు ఇప్పించడమే కాకుండా, రుడా తరపున మరో రూ.30 లక్షలు మంజూరు చేయించాల్సిందిగా రుడా చైర్మన్ రౌతును కోరుతూ సిఫారస్సు లేఖను అందించామన్నారు. వచ్చే బోర్డు ఎన్నికల్లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని రౌతు స్పందించారన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రతి డివిజన్‌లోను తమ సంఘం తరపున పర్యటించి భరత్‌కు మద్దతుగా ప్రచారం చేస్తామన్నారు. భరత్ ఎమ్మెల్యేగా, గూడూరి ఎంపీగా విజయం సాధించి తమ పద్మశాలీ సంఘం కల్యాణ మండపాన్ని ప్రారంభించాలని ఆకాంక్షిస్తున్నామన్నారు. విలేకరుల సమావేశంలో ఇమంది కన్నారావు, నందం కుమార్ రాజా, నందం స్వామి, నామాల వెంకటరమణ, జాగు సత్యనారాయణ(వంకాయల సత్తిబాబు), వానపల్లి వెంకటేశ్వరరావు, జి.సత్యనారాయణ, మీసాల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా పల్లాలమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



అమ్మవారి విగ్రహానికి పసుపునీళ్లతో అభిషేకం చేసిన మహిళలు



కడియపులంకలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కడియం: కడియపులంక గ్రామంలో పల్లాలమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠాపన బుధవారం వైభవంగా జరిగింది. అత్యంత పురాతనమైన ఈ ఆలయాన్ని దాతల సహకారంతో ఇటీవలే పునర్నిర్మించారు. ఈ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం గత మూడు రోజులుగా ప్రముఖ వేదపండితుల సమక్షంలో శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం ఉదయం 9.41 గంటలకు విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అంతకు ముందు గ్రామంలోని మహిళలు, యువతులు పెద్ద ఎత్తున కలశాలలో నదీజలాలతో తరలివచ్చారు. అమ్మవారి విగ్రహానికి పుసుపునీళ్లతో అభిషేకాలు చేశారు. ఆధ్యాత్మిక భజన గీతాలు ఆలపిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. ఇంటి ఆడపడుచులు చీరసారె, నైవేద్యాలు సమర్పించారు. జాతీయ రహదారికి పక్కనే నూతనంగా నిర్మించిన ఆలయంలో ప్రతిష్ఠాపనను విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామివారి ఆస్థాన శిల్పి, ఆగమ సిద్ధాంతి కురుగంటి షణ్ముఖశాస్త్రి పర్యవేక్షించారు. పల్లాలమ్మతో పాటు విజయగణపతి, విద్యా సరస్వతీదేవి విగ్రహాలను కూడా ఆలయంలో ప్రతిష్ఠించారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది.

అమ్మవారిని దర్శించుకున్న చందన



కడియపులంకలో పల్లాలమ్మవారిని దర్శించుకున్న చందన నాగేశ్వర్

కడియం: రాష్ట్ర గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ కడియపులంకలోని పల్లాలమ్మ అమ్మవారిని బుధవారం దర్శించుకున్నారు. అమ్మవారి నూతన విగ్రహ ప్రతిష్ఠాపనను పురస్కరించుకుని ఆయన ప్రత్యేక పూజలు అన్నదాన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

ఘనంగా ప్రపంచ రంగస్థల దినోత్సవం



రంగస్థలనటుడు త్యాగరాజు, పెయ్యల రాజేష్‌ను సత్కరిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: బొమ్మూరు కొత్తపేటలో ఫిలాంత్రోఫిక్ సొసైటీ అధ్యక్షుడు అద్దంకి రాజాయోనా ఆధ్వర్యంలో ప్రపంచ రంగస్థల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ ముద్దాల అను, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెయ్యల రాజేష్ మాట్లాడుతూ నాటక సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత నేటి సమాజంపై ఉందన్నారు. ఈ సందర్భంగా రంగస్థల నటుడు, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి యెనుముల త్యాగరాజు సేవలను కొనియాడి, ఘనంగా సత్కరించారు. అనంతరం పెయ్యలరాజేష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో వైస్సార్ సీపీ నాయకులు దాకే శ్రీనివాసరావు, కాకులపాటి కుమార్, బూసికృష్ణ, రాజేష్ యువసేన పాల్గొన్నారు.

అహంకారమే పతనానికి కారణం



ప్రవచనం చేస్తున్న శతావధాని తాతా సందీప్ శర్మ

ప్రకాశం నగర్ : అహంకారమే పతనానికి కారణమని శతావధాని తాతా సందీప్ శర్మ అన్నారు. బుధవారం స్థానిక మెయిన్ రోడ్డులోని జరుగుతున్న ద్వాదశ (12వ) వార్షిక కుంభాభిషేక మహోత్సవాలకు ఆయన విచ్చేశారు. ఈ సందర్భందగా ఆయన మాట్లాడుతూ భాగవతం అష్టమ స్కంధంలో వామన చరిత్రం అద్భుతమైన ఘట్టమన్నారు. శ్రీమహావిష్ణువు అదితి, కశ్యపులకు వామనునిగా జన్మించి బలిచక్రవర్తి వద్దకు వెళ్లి, మూడు అడుగులు దానం అడిగి అతనిని బంధించాడని, క్రింది లోకాలను పాలించమని అనుగ్రహించాడని పేర్కొన్నారు. ఇందులో పద్యాలు చాలా రమణీయంగా, తెలుగుభాషా వైభవాన్ని , భక్తి భావాన్ని చాటిచెబుతాయని తెలిపారు.

మంత్రి చెల్లుబోయిన వేణుకు ఘన స్వాగతం



మధురపూడి ఎయిర్‌పోర్టులో మంత్రి వేణుకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలుకుతున్న పార్టీ శ్రేణులు

రాజమహేంద్రవరం రూరల్: హైదరాబాద్‌లో చికిత్స చేయించుకుని రాజమహేంద్రవరానికి బుధవారం వచ్చిన రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార, పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి, వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం రూరల్ నియోజవర్గ అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణకు పార్టీ శ్రేణులు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. హైదరాబాద్ నుంచి మధురపూడి ఎయిర్‌పోర్టులో మంత్రి వేణుగోపాలకృష్ణకు పార్టీ నేతలు పుష్పగుచ్చాలు అందజేశారు. ఆయన పార్టీశ్రేణులతో కలిసి ఎయిర్‌పోర్టు నుంచి బొమ్మూరులోని వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ కార్యాలయానికి చేరుకున్నారు. అక్కడ మంత్రి వేణును పలువురు నాయకులు కలిసి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఉప్పులూరి వీరవెంకట సత్యనారాయణ, మాజీ వైస్ ఎంపీపీ నక్కారాజబాబు, నగరపాలక సంస్థ రూరల్ డివిజన్ల క్లస్టర్ అధ్యక్షుడు మింది నాగేంద్ర, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి బడుగు ప్రశాంత్‌కుమార్, జేసీఎస్ కన్వీనర్లు తాటికొండ విష్ణుమూర్తి, తాడాల చక్రవర్తి, రాజమౌళి, పార్టీ రాష్ట్ర సంయుక్తకార్యదర్శి పెయ్యల రాజేష్, చెల్లుబోయిన నరేన్, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, అభిమానులు పాల్గొన్నారు.

ఓటు వినియోగంపై అవగాహన

కంబాలచెరువు: స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్స్ పార్టిసిపేషన్ భాగస్వామ్యంతో ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.రామచంద్రరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు తమ ఓటు విలువను గుర్తించాలని, ఏ ప్రలోభాలకు లోనవకుండా ఓటును వినియోగించుకోవాలన్నారు. అలాగే ప్రతి విద్యార్థి ఓటు వేయడం తమ సామాజిక బాధ్యతగా గుర్తించాలన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.వినూత్న మాట్లాడుతూ విద్యార్థులు తాము ఓటు వేయడమే కాకుండా ఇంట్లో అందరూ ఓటు వేసేలా చూడాలని, ఈ సారి నూరు శాతం పోలింగ్‌ను సాధించాలన్నారు. కళాశాల జాతీయ సేవా పథకం కోఆర్డినేటర్ డాక్టర్ బి.మల్లికార్జున మాట్లాడుతూ సమాజం అభివృద్ధి చెందాలంటే విద్యార్థులు ఓటు వినియోగంలో క్రియాశీలకంగా ఉండాలని, ఓటర్ నమోదు, వివరాల సవరింపు వంటి విషయాలపై అవగాహన కలిగి ఉండడంతో పాటు పరిసర ప్రజలకు సహాయం చేయాలన్నారు. అనంతరం ఓటు వినియోగంపై అవగాహన కల్పిస్తూ ర్యాలీను నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు షేక్. జరీన బేగం, బి.సుభాషిణిదేవి, డాక్టర్ పి.మురళీకృష్ణ, డాక్టర్ బి.భవానీదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.



ఓటు హక్కుపై కడియంలో ప్రతిజ్ఞ చేస్తున్న స్థానికులు

కడియం: మండల కేంద్రమైన కడియంలో ఓటు హక్కుపై అవగాహన ర్యాలీని బుధవారం నిర్వహించారు. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్నికల్లో ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలి, దాని ప్రాధాన్యం ఏమిటి తదితర అంశాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అంతకు ముందు గ్రామంలో అవగాహన ర్యాలీ జరిగింది. ఎటువంటి ప్రలోభాలకు లోను కాకుండా ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకుంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిపియం బి.హేమంత్, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు డి.వి.సింహాచలం, కె.విజయలక్ష్మి, వీఓఏలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామ సంఘాల మహిళలు పాల్గొన్నారు.